గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం

మంచిర్యాల అర్బన్, జనవరి 25 : గణతంత్ర్య దినోత్సవ వేడుకల కోసం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని జిల్లా బాలుర పాఠశాల మైదానంలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. వేడుకలకు సంబంధించి పరేడ్ గ్రౌండ్‌ను శనివారం ముస్తాబు చేశారు. కార్యక్రమాలను తిలకించేందుకు వీక్షకుల కోసం ప్రత్యేక షామియానాలు, కుర్చీలు వేశారు. ప్రదర్శనల నిర్వహణకు అనువుగా ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు పురస్కారాలు అందించేందుకు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు, శకటాల ప్రదర్శన నిర్వహించేందుకు సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేశారు.

విజయవంతం చేయాలి..

నస్పూర్, జనవరి 25 : జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న వేడుకలను విజయవంతం చేయాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. ఉదయం 9 నుంచి 9.15 గంటల వరకు కలెక్టర్ జాతీయ పతాకావిష్కరణ, గౌరవ వందన స్వీకారం, 9:15 గంటలకు ప్రసంగం, 9:30 గంటలకు సాంస్కృతిక విన్యాసాలు, 10:30 గంటలకు శకటాల ప్రదర్శన, 10:45 నుంచి ప్రశంసా పత్రాల ప్రధానం, 11:30 గంటలకు స్టాల్స్ సందర్శన ఉంటుందని వివరించారు. సాయంత్రం 4 గంటలకు కలెక్టరేట్ ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

ఆసిఫాబాద్‌లో..

ఆసిఫాబాద్ టౌన్, జనవరి 25 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని పోలీస్ డీఆర్ హెడ్ క్వార్టర్స్ పరేడ్ గ్రౌండ్ వేడుకలకు ముస్తాబయ్యింది. ఎస్పీ డీవీ శ్రీనివాసరావు పర్యవేక్షించారు. పోలీస్ సిబ్బంది పరేడ్ ప్రాక్టీస్‌ను పరిశీలించారు. వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు పోలీస్ అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలన్నారు. పరేడ్ కమాండర్ గా ఆర్ఐ అడ్మిన్ పెద్దయ్య వ్యవహరించనున్నారు. వివిధ విభాగాల పోలీసు లు ఆరు ప్లాటూన్స్‌లో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఏఎస్పీ ప్రభాకర్ రావు, ఎస్బీ సీఐ రాణా ప్రతాప్, ఆర్ఐ అంజన్న, పరేడ్ సిబ్బంది పాల్గొన్నారు.

తాండూర్‌లో..

తాండూర్, జనవరి 25 : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల వద్ద ఏర్పాట్లు చేశారు. పాఠశాలలు, కార్యాలయాల ప్రాంగణమంతా త్రివర్ణ తోరణాలు, మామిడాకులతో ముస్తాబు చేశారు.

రెబ్బెనలో..

రెబ్బెన, జనవరి 25 : బెల్లంపల్లి ఏరియా గోలేటి భీమన్న క్రీడామైదానంలో సింగరేణి అధికారులు ఏర్పాట్లు చేశారు. జీఎం శ్రీనివాస్ పరిశీలించారు. సెక్యూరిటీ అధికారి ఉమాకాంత్, సివిల్ ఈఈ రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

కౌన్సిల్ వీడ్కోలు సన్మానం

రామకృష్ణాపూర్, జనవరి 25 : క్యాతనపల్లి మున్సిపాలిటీ పాలకవర్గ పదవీ పూర్తవుతున్న సందర్భంగా శనివారం పురపాలక నర్సరీలో కమిషనర్ జీ రాజు అధ్యక్షతన ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. చైర్ పర్సన్ జంగం కళ, వైస్ చైర్మన్ ఎర్రం విద్యాసాగర్‌రెడ్డి, కౌన్సిల్ సభ్యులు, కో- ఆప్షన్ సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. వైస్ చైర్మన్ విద్యాసాగర్‌రెడ్డి, కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, మేనేజర్ డీ స్వామి, డీఈ ఎం సుమతి, మున్సిపల్ ఏఈ అచ్యుత్, టీపీఎస్ రాజ్‌కుమార్, రెవెన్యూ అధికారి కే సతీశ్, సీనియర్ అకౌంటెంట్ వీరన్న పాల్గొన్నారు.

లక్షెట్టిపేట కౌన్సిల్ సమావేశం..

మంచిర్యాల టౌన్ (దండేపల్లి), జనవరి 25 : లక్షెట్టిపేట మున్సిపల్ పాలకవర్గ ముగింపు సమావేశం కార్యాలయంలో చైర్మన్ నల్లాసు కాంతయ్య అధ్యక్షతన నిర్వహించారు. కౌన్సిలర్లను సన్మానించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులున్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు విలువైనది

నస్పూర్ : ఓటరు ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్, అధికారులు

ఆసిఫాబాద్ టౌన్ : ఆసిఫాబాద్‌లో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్

నస్పూర్, జనవరి 25 : దేశ పౌరులకు భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ఎంతో విలువైనదని, 18 ఏళ్లు నిండిన వారంతా ఓటు హక్కు పొందాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. శనివారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో 15వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచంలోనే మన దేశం అతి పెద్ద ప్రజాస్వామ్యం కలిగి ఉందన్నారు. ఒక్క ఓటుతో గెలుపోటములు మారుతాయని, ఎన్నికల సమయంలో ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలన్నారు. అనంతరం అధికారులు, విద్యార్థులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వృద్ధులు, యువ ఓటర్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మోతీలాల్, ఆర్డీవో శ్రీనివాసరావు, డీఆర్‌డీవో కిషన్ పాల్గొన్నారు.

ఆదర్శవంతమైన ప్రజాస్వామ్య వ్యవస్థ నిర్మిద్దాం..

ఆసిఫాబాద్ టౌన్, జనవరి 25 : ఓటు హక్కును వినియోగించుకుందాం – ఆదర్శవంతమైన ప్రజాస్వామ్య వ్యవస్థ కోసం మన వంతు పాత్ర పోషిద్దామని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ఓటరు దినోత్సవంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధాశుక్లా, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వరరావు, స్వీప్ నోడల్ అధికారి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారాంతో కలిసి హాజరయ్యారు. అనంతరం అధికారులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. గత శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటరు జాబితా తయారీ, ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడంలో కృషి చేసిన బూత్ స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లు, ఉప తహసీల్దార్లు, పంచాయతీ కార్యదర్శులు, తహసీల్దార్లకు ప్రశంసా పత్రాలు అందజేశారు. రంగోలి కార్యక్రమంలో పాల్గొన్న వారికి బహుమతులు అందజేశారు. కలెక్టరేట్ పరిపాలనాధికారి మధుకర్ పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌లో 2కే రన్..

కలెక్టరేట్‌లో జాతీయ ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన 2కే రన్ కార్యక్రమాన్ని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీ.. జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వరరావు, స్వీప్ నోడల్ అధికారి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారాంతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. కుమ్రం భీం చౌరస్తా మీదుగా జిల్లా కేంద్రంలోని బస్టాండ్, అంబేద్కర్ చౌక్ వరకు కొనసాగించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, తహసీల్దార్ రోహిత్, కలెక్టరేట్ పరిపాలనాధికారి మధుకర్ పాల్గొన్నారు.

'హెల్మెట్ భారం కాదు-భద్రత'

హెల్మట్ అందుకున్న మహిళలతో నీపీ శ్రీనివాస్, డీసీపీ భాస్కర్, ఏసీపీ

మంచిర్యాల అర్బన్, జనవరి 25 : ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ భారం కాదు-భద్రత అని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా హెల్మెట్‌తో ప్రాణానికి భద్రత అని అవగాహన కల్పిస్తూ మంచిర్యాల పట్టణంలో శనివారం ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో మహిళలు, సీనియర్ సిటిజన్స్, మున్సిపల్ సిబ్బందికి 150 హెల్మెట్లను డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాశ్, ట్రాఫిక్ ఏసీపీ నరసింహులుతో కలిసి పంపిణీ చేశారు. ఏదో ఒక రకంగా ప్రమాదానికి గురై ద్విచక్రవాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నారని, ఇలా చనిపోతున్నవారిలో ఎక్కువగా హెల్మెట్ లేకుండా ప్రయాణించేవారేనని సీపీ తెలిపారు. హెల్మెట్ల స్పాన్సర్, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు ఎంజీ అజీజ్, మంచిర్యాల పట్టణాధ్యక్షుడు కొమ్ము దుర్గాప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ ఉస్మాన్ పాషా, మందమర్రి జనరల్ సెక్రటరీ లతశ్రీ, మంచిర్యాల కళాశాలల ప్రెసిడెంట్ రమణను సీపీ సత్కారించి, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల పట్టణ సీఐ ప్రమోద్‌రావు, ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ మంచిర్యాల రూరల్ సర్కిల్ సీఐ అశోక్ కుమార్, ఎస్ఐలు, సిబ్బంది ఉన్నారు.

ప్రాపర్టీ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి..

ప్రాపర్టీ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీపీ శ్రీనివాస్ అన్నారు. పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పరిధిలోని డీసీపీ, ఏసీపీ, ఇతర అధికారులతో ఆన్‌లైన్ జూమ్ మీటింగ్ ద్వారా పలు కేసుల పరిష్కారంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. పోలీస్ స్టేషన్ల వారీగా ప్లాన్ ఆఫ్ యాక్షన్ ప్రణాళిక ఏర్పాటు చేసుకోవాలని, దాని గురించి రివ్యూ చేసి ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పలు కేసుల గురించి చర్చించారు.

రాజ్యాంగమే బలం : సీఎండీ బలరాం

గ్యాలరీని ప్రారంభిస్తున్న సీఎండీ బలరాం

శ్రీరాంపూర్, జనవరి 25 : హైదరాబాద్ సింగరేణి భవన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన నూతన సింగరేణి సందర్శకుల గ్యాలరీని శనివారం సీఎండీ ఎన్ బలరాం ప్రారంభించారు. సీఎండీ మాట్లాడుతూ.. మన రాజ్యాంగమే మన బలం.. అందరూ గౌరవించుకోవాలని కోరారు. భారత రాజ్యాంగంపై ప్రతిఒక్కరికీ అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో సింగరేణి భవన్‌లో సందర్శకుల గ్యాలరీలో రాజ్యాంగ ప్రతిని పొందపర్చినట్లు పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని ఆమోదించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా అందరికీ రాజ్యాంగ ప్రతిని సింగరేణి భవన్‌లో ఏర్పాటు చేశామన్నారు. జీఎం కోఆర్డినేషన్ ఎస్టీఎం సుభానీ, జీఎం మార్కెటింగ్ డీ రవిప్రసాద్ పాల్గొన్నారు.

బొగ్గు మైనింగ్ రంగంలో సుధీర్ఘ అనుభవమున్న సింగేణి కాలరీస్ లిథియంలాంటి క్రిటికల్ మినరల్స్ రంగంలోకి ప్రవేశించాలన్న సీఎం, డిప్యూటీ సీఎంల ఆదేశాల మేరకు యాజమాన్యం ఆ దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నది. ఇందులో భాగంగా డిప్యూటీ సీఎం సమక్షంలో ఇటీవల హైదరాబాద్ ఐఐటీ తో కీలక ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఒప్పందానికి కొనసాగింపుగా సింగరేణి భవన్‌లో ఐఐటీ డైరెక్టర్ బీఎస్ మూర్తి నేతృత్వంలో ప్రొఫెసర్ల బృందం సీఎండీ, డైరెక్టర్లు, సీనియర్ మైనింగ్ అధికారులతో ప్రత్యేకంగా సమావేశమైంది. సింగరేణి చేస్తున్న ప్రయత్నాలకు హైదరాబాద్ ఐఐటీ పూర్తి సహకారం అందిస్తున్నదని ఆ సంస్థ డైరెక్టర్ బీఎస్ మూర్తి పేర్కొన్నారు. ఈ సమావేశంలో కొత్తగూడెం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డైరెక్టర్లు సత్యనారాయణ, వెంకటేశ్వర్‌రెడ్డి, హైదరాబాద్‌లో జీఎం కోఆర్డినేషన్ ఎస్‌డీ సుభానీ, క్రిటికల్ మినరల్స్ అసోసియేషన వ్యవస్థాపక అధ్యక్షులు, నిపుణులు సందీప్ హామమీళ్టరన్, ఐఐటీ నుంచి ప్రొఫెసర్ నరసింహా, అసిస్టెంట్ ప్రొఫెసర్ అసోక్ కామరాజు పాల్గొన్నారు.

ఉత్తమ ఉద్యోగుల ఎంపిక

జైపూర్, జనవరి 25 : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎస్టీపీపీ నుంచి నలుగురు ఉత్తమ ఉద్యోగులను అధికారులు ఎంపిక చేశారు. వేడుకల్లో వీరిని అధికారులు సన్మానించనున్నారు. ఉత్తమ అధికారిగా పర్చేస్ డిపార్ట్‌మెంట్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పని చేస్తున్న కే అరుణ్, ఉత్తమ సింగరేణియన్‌గా అజ్మీరా మోహన్‌ను కొత్తగూడెంలో జరిగే వేడుకల్లో సీఎండీ బలరాం సన్మానించనుండగా, సీనియర్ స్టాఫ్‌నర్సు రాజమణి, యాష్ డిపార్ట్‌మెంట్ జూనియర్ అసిస్టెంట్ వెంకటస్వామిను ఎస్టీపీపీలో సన్మానించనున్నట్లు అధికారులు తెలిపారు.

బెల్లంపల్లి ఏరియా నుంచి..

రెబ్బెన, జనవరి 25 : బెల్లంపల్లి ఏరియాలో ఉత్పత్తి సాధన, విధి నిర్వహణలో ప్రతిభ చూపిన ఉద్యోగులను ఉత్తమ ఉద్యోగులుగా ఎంపిక చేసినట్లు అధికార ప్రతినిధి రెడ్డిమల్ల తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఖైర్‌గూడ ఓసీపీ వెల్డర్ అదునూరి సుధాకర్ బెస్ట్ సింగరేణియన్‌గా, అలాగే ఓసీపీ ఇంజినీర్ బీ వీరన్న బెస్ట్ అధికారిగా, ఈపీ ఆపరేటర్ దూలం సదయ్య ఉత్తమ ఉద్యోగిగా, జనరల్ మజ్దూర్ పర్చకి ధన లక్ష్మి ఉత్తమ ఉద్యోగిగా ఎంపికైనట్లు పేర్కొన్నారు. బెస్ట్ సింగరేణియన్‌ను కొత్తగూడెంలో సీఎండీ, ఉత్తమ ఉద్యోగులను గోలేటి భీమన్న క్రీడామైదానంలో జీఎం సన్మానించనున్నట్లు తెలిపారు.

రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో క్రీడా పోటీలు

బెల్లంపల్లి, జనవరి 25 : గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని పట్టణంలోని రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో శనివారం వాలీబాల్, క్యారమ్స్, చెస్, వీల్ చైర్, రంగోలి పోటీలు నిర్వహించారు. రంగోలిలో విజేతలుగా నిలిచిన వారికి రైల్వే హైల్త్ డిపార్ట్‌మెంట్ డీఎంవో ప్రణీత బహుమతులు అందజేశారు. మిగతా పోటీల్లో విజేతలకు ఆదివారం బహుమతులు అందజేయనున్నారు. రైల్వే ఇన్‌స్టిట్యూట్ కార్యదర్శి రమేశ్, సంయుక్త కార్యదర్శి పీ సోల్‌మానా, యూనియన్ చైర్మన్ నాగరాజు, కార్యదర్శి జీ సదాశివుడు పాల్గొన్నారు.

ఉద్యోగులకు ప్రోత్సాహక బహుమతులు

కాసిపేట, జనవరి 25 : మందమర్రి ఏరియా కాసిపేట 2 ఇంక్లైన్ గనిలో విధుల్లో ఉత్తమ ప్రతిభ చూపిన ఉద్యోగులకు మేనేజర్ లక్ష్మీనారాయణ చేతుల ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఉత్పత్తి, ఉద్యోగుల్లో ఉత్సాహాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టి అత్యుత్తమంగా పని చేసిన 9 మంది ఉద్యోగులను గుర్తించి, వారికి ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఫార్ట్ ఫైరర్ అజయ్, కోల్ కటర్స్ ఓదెలు, శంకర్, భాస్కర్, మహేశ్, ఎస్‌డీఎల్ ఆపరేటర్ లక్ష్మీనారాయణ, ట్రామర్ సదానందం, హాలేజ్ ఆపరేటర్ సుభాన్, జనరల్ మజ్దూర్ మొగిళికి బహుమతులు అందించారు. అనంతరం ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. పిట్ కార్యదర్శి గొల్ల శ్రీనివాస్, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉత్తమ రిటర్నింగ్ అధికారిగా రాహుల్

బెల్లంపల్లి, జనవరి 25 : గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో బెల్లంపల్లి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిగా పనిచేసిన రాహుల్ ఉత్తమ రిటర్నింగ్ అధికారిగా అవార్డు అందుకున్నారు. తెలంగాణ ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన 15వ జాతీయ ఓటర్ దినోత్సవంలో గవర్నర్ విష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. ప్రస్తుతం రాహుల్ భద్రాచలం ఐటీడీఏ పీవోగా విధులు నిర్వరిస్తున్నారు.

ఉత్తమ తహసీల్దార్‌గా..

కాసిపేట, జనవరి 25 : కాసిపేట తహసీల్దార్ భోజన్న ఉత్తమ తహసీల్దార్, ఏఆర్వోగా మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో 2024 ఎన్నికల నిర్వహణలో ఉత్తమ విధులు నిర్వహించినందుకు గాను ఎన్నికల సంఘం నుంచి అవార్డును కలెక్టర్ తహసీల్దార్‌కు అందించారు.

బెస్ట్ బూత్ లెవెల్ ఆఫీసర్‌గా..

రెబ్బెన, జనవరి 25 : రెబ్బెన మండలం ఇందిరానగర్ అంగన్‌వాడీ టీచర్ తిరుపతమ్మ బెస్ట్ బూత్ లెవెల్ ఆఫీసర్‌గా అవార్డు అందుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వరరావు చేతుల మీదుగా శనివారం అవార్డు అందుకోవడంతో గ్రామంలోని పలువురు అభినందనలు తెలిపారు.

ఎంపికైన గ్రామాల్లో పథకాలు అందించాలి

నస్పూర్, జనవరి 25 : రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల అమలులో భాగంగా ఎంపికైన గ్రామాల్లో ఈ నెల 26న లబ్ధిదారులకు పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, అదనపు కలెక్టర్, అధికారులతో సమావేశం నిర్వహించారు. లాంఛనంగా ప్రారంభించనున్న పథకాలను లబ్ధిదారులకు అందించేందుకు మండలానికో గ్రామాన్ని ఎంపిక చేయాలన్నారు. పథకాలు ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ.. మండలానికో గ్రామాన్ని ఎంపిక చేసి, లబ్ధిదారులకు పథకం మంజూరు పత్రాలను అందజేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. డీసీపీ భాస్కర్, అదనపు కలెక్టర్ మోతీలాల్ పాల్గొన్నారు.

మండలానికో గ్రామాన్ని ఎంపిక చేయాలి

ఆసిఫాబాద్ టౌన్, జనవరి 25 : రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల అమలు కోసం మండలానికో గ్రామం చొప్పున ఎంపిక చేసి, పథకాల అమలుకు చర్యలు తీసుకోవాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అధికారులకు సూచించారు. కలెక్టరేట్ నుంచి శనివారం అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, ఎం డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్ రావుతో కలిసి జూమ్ మీటింగ్ ద్వారా ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మండల వ్యవసాయ అధికారులు, ఉపాధి హామీ ఏపీఎంలు, సెర్ప్‌లతో గ్రామ సభల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. లబ్ధిదారులకు పథకాలు అందించేందుకు పూర్తిస్థాయి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని సూచించారు. డీఆర్డీవో దత్తా రాం, డీపీవో భిక్షపతి, పౌరసరఫరాల శాఖ అధికారి వినోద్ కుమార్, జడ్పీ సీఈవో సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

సులభ్ కాంప్లెక్స్ కూల్చివేస్తే సహించం

మందమర్రి, జనవరి 25 : మందమర్రి మున్సిపాలిటీ పరిధి రామన్ కాలనీ జాతీయ రైల్వే ట్రాక్ సమీపంలో గల సులభ్ కాంప్లెక్స్‌ను కూల్చివేస్తే సహించేది లేదని ఆ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం హెచ్చరించారు. జాతీయ రైల్వే శాఖ అధికారులు మూడో లైన్ నిర్మాణం పేరిట సులభ్ కాంప్లెక్స్‌ను కూల్చివేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. శనివారం జేసీబీలతో రాగా, యూనియన్ ఆధ్వర్యంలో నాయకులు, కార్మికులు అడ్డుకున్నారు. యూనియన్ నాయకులు వెంకటేశ్, మల్లేశ్, గణేశ్, అప్పా రావు, అజయ్, మహేశ్వరి, సునీత, మీన పాల్గొన్నారు.

సంచార జాతుల సంఘం కార్యవర్గం

మంచిర్యాల అర్బన్, జనవరి 25 : మంచిర్యాల పట్టణంలోని నార్త్ ఇన్ హోటల్‌లో శనివారం సంచార జాతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తిపిరిశెట్టి శ్రీనివాస్, అధ్యక్షుడు కోనేటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి గండికోట కృష్ణ, గౌరవాధ్యక్షుడు తాళ్ల వేణు, జిల్లా అధ్యక్షుడు మద్దివేణి అర్జున్, ప్రధాన కార్యదర్శి జక్కుల సమ్మయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ రవికుమార్, కోశాధికారి పురాణం క్రాంతి కుమార్, ఉపాధ్యక్షుడు వైద్య భాస్కర్, సాయికుమార్, ఉప కార్యదర్శి రాథోడ్ భాస్కర్ ఎన్నుకున్నారు.

వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలి

సిర్పూర్(యూ), జనవరి 25 : స్వామి వివేకానంద జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని ఆసరా వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి జాదవ్ శ్రావణ్ పేర్కొన్నారు. కేజీబీవీలో శనివారం విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. ప్రత్యేకాధికారి స్వప్న, ఉపాధ్యాయులు ఉన్నారు.

దాడి చేసిన వారిని శిక్షించాలి

మందమర్రి రూరల్, జనవరి 25 : సోన్ మండలం సాకెరలో గురువారం ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్ పై దాడి చేసిన వారిని శిక్షించాలని ఆ సంఘం మంచిర్యాల జిల్లా గౌరవాధ్యక్షుడు ఈద లింగయ్య, అధ్యక్షుడు నక్క రాజన్న డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారుల ఎంపికలో ఫీల్డ్ అసిస్టెంట్లు పూర్తి బాధ్యత అని గ్రామస్తులు దాడి చేయడం హేయమైన చర్య అని, ఈ దాడులను ఖండించాలని ఉన్నతాధికారులను కోరారు.

ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కారు అడ్డగింత

చెన్నూర్ నియోజకవర్గ ఎన్నికల అసిస్టెంటు రిటర్నింగ్ అధికారి చంద్రకళ కారును అడ్డుకున్న బాధితులు

చెన్నూర్, చంద్రకళ కారును అడ్డుకున్న బాధితులు

చెన్నూర్‌లో పలువురు బాధితులకు సంబంధించిన బిల్లులు చెల్లించాలని కోరుతూ పలువురు బాధితులు ఓటరు దినోత్సవంలో పాల్గొనేందుకు మంచిర్యాల జిల్లా చెన్నూర్‌కు వచ్చిన నియోజకవర్గ ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి చంద్రకళ కారును శనివారం అడ్డుకున్నారు. మేడమ్ మా బిల్లులు ఇంకెప్పుడు చెల్లిస్తారు అంటూ ఆందోళనకు దిగారు. గతేడాది ఏప్రిల్‌లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో పట్టణానికి చెందిన పాయిరాల బాపు 50 రోజుల పాటు అవసరమైన లైటింగ్, సౌండ్ సిస్టంలతో పాటు కూలర్లు, ప్యాన్లు ఏర్పాటు చేశారు. అలాగే స్థానిక ఫొటో స్టూడియో యజమాని మక్సూద్ వీడియో గ్రాఫర్లు, కెమెరాలు ఏర్పాటు చేశారు. పాయిరాల బాపుకు రూ 8.75 లక్షల బిల్లులు రావాల్సి ఉండగా, రూ 5 లక్షలు చెల్లించారు. ఇంకా రూ 3.75 లక్షలు చెల్లించాల్సి ఉంది. మక్సూద్‌కు రూ 13.48 లక్షల బిల్లులు రావాల్సి ఉండగా, రూ 10 లక్షలు చెల్లించడంతో ఇంకా రూ 3.48 లక్షలు రావాల్సి ఉంది. బకాయిల గురించి ఎన్నోసార్లు ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి చంద్రకళతో పాటు తహసీల్ కార్యాలయం చుట్టూ తిరిగిన ఫలితం లేకకుండా పోయిందని బాధితులు ఆరోపించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి చంద్రకళ మంచిర్యాలలో పని చేస్తున్నందడంతో అక్కడికి వెళ్లి బిల్లుల గురించి అడిగారు. దీంతో ఆమె ఇక్కడికి రావద్దని.. ఎక్కడ ఏర్పాట్లు చేశారో.. అక్కడే అడుక్కోవాలని దబాయించారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రిటర్నింగ్ అధికారి మాట ప్రకారం చెన్నూర్ తహసీల్ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్‌ను అడిగితే మీరు రిటర్నింగ్ అధికారిని అడగాలని చెప్పారని, దీంతో గత్యంతరం లేక చంద్రకళ కారును అడ్డుకొని ఆందోళన చేసామని బాధితులు తెలిపారు. బిల్లులు మంజూరైన తర్వాత చెల్లిస్తామని రిటర్నింగ్ అధికారి తెలిపారన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ కుమార్‌దీపక్ స్పందించి తమకు రావాల్సిన బిల్లులు ఇప్పించాలని బాధితులు విజ్ఞప్తి చేశారు.

కవ్వాల్ అడవుల్లో పక్షుల సర్వే షురూ

జన్నారం,జనవరి 25 : కవ్వాల్ టైగర్ రిజర్వులోని తాళ్లపేట్, జన్నారం రేంజ్ అడవుల్లో సమగ్ర పక్షుల సర్వే శనివారం ప్రారంభమైంది. జన్నారం ఎఫ్‌ఆర్వో సుష్మ, హైదరాబాద్ బర్డింగ్ పాల్స్, డెక్కన్ బర్డ్స్, ఐఐఎస్ఈఆర్ తిరుపతి, ఫారెస్ట్ కళాశాలకు చెందిన విద్యార్థులు, పక్షి ప్రేమికులు, డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఎన్‌జీవోలతో కలసి సర్వే చేపట్టారు. ఆదివారంతో సర్వే ముగుస్తుందని ఎఫ్‌ఆర్వో సుష్మ తెలిపారు.

నియామక పత్రం స్వీకరణ

కాసిపేట, జనవరి 25 : మున్నూరు కాపు సంఘం కాసిపేట మండలాధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన అట్టెపల్లి శ్రీనివాస్ పటేల్.. రాష్ట్ర మహాసభ అనుబంధ సంఘం నుంచి శనివారం అధికారికంగా మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ పటేల్, జిల్లా ప్రధాన కార్యదర్శి లచ్చన్న చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో శ